# సంపాదకీయం

జిజ్ఞాస. సమస్త విజ్ఞాన సమపార్జనకు ప్రశ్నయే మొదటి మెట్టు. ప్రకృతిపై పరిశోధనలలో మనం వేసే ప్రశ్నను అనుసరించే సమాధానం వస్తుంది. మనం వేయని ప్రశ్నకు మన మీద దయ తలిచి ప్రకృతి సమాధానం చెప్పి వేయదు. ఎంత ప్రశ్నకు అంత మట్టుకు సమాధానం. ఎంత సూక్ష్మాతి సూక్ష్మమైన సూటి ప్రశ్న వేస్తే అంత సూటి సమాధానం పరిశోధకులకు లభిస్తుంది. ఇందులో ప్రకృతితో బేరసారాలు లేవు.

పరిశోధనలు ప్రయోగశాలలో జరిగినా, మేధలో జరిగినా విజ్ఞానికి గ్రంథసంచయ సందర్శనం అత్యంత ఆవశ్యకం. ఆ గ్రంథనిధి గత కొన్ని శతాబ్దాలుగా అపారంగా పెరిగిపోతున్నది. ఏ ఒక్క వ్యక్తి కూడా ఇంత విస్తార వాఙ్మయాన్ని గుర్తుంచుకోలేరు. అందుకే శాస్త్రంలోనూ శాస్త్రజ్ఞులలోనూ విభాగాలు పెరిగి పోతున్నాయి.

యంత్రాలకు ఆలోచన అంటే ఏమో ప్రస్తుతానికి తెలియకపోయినా, వాటి స్మృతిశక్తి మాత్రం అమేయం. వాటికి మేతగా వేస్తున్న ప్రపంచపు పలు భాషా వాఙ్మయాలను ఆరగించి గుర్తుంచు కుంటున్నాయి. ఇది మనిషికి గొప్ప సాధనం.

యాంత్రిక బుర్రలు పూర్తి పాండిత్య స్థితిని ఇంకా చేరుకోలేదు. అవి అడపా దడపా అవాకులు చవాకులు పేలవచ్చు. విజ్ఞులు దానిని గురించగలరు కానీ పామరులు - అంటే ఆ శాస్త్రంలో పాండిత్యం లేనివారు - గుర్తించలేక నిజమని నమ్మే ప్రమాదం ఉన్న మాట వాస్తవమే. “విననంతనె వేగపడక వివరించుకొని, కని కల్ల నిజము” తెలియాలి.

నేటి తెలివైన యంత్రాలు అరచేతిలోని విశ్వవిద్యాలయాలు. కాలేజీలలోని సమస్త విభాగాల సంకలనాలు. పామరులకు సైతం సేవ చేసే పండితులు. మనిషిలోని జిజ్ఞాసను తీర్చే గురువులు.

యంత్రంతో మంతనం ఒక ఏకాంత సభ. సాధారణ సభా మర్యాదలకు భిన్నంగా ఈ సభలో పెక్కు శాస్త్ర శాఖా చంక్రమణాలు చెయ్యవచ్చు. మన ఆలోచనా విహంగాలు  పొలిమేరలు లేని స్వేచ్ఛాకాశంలో కుతూహలపు అంచుల్ని తాకే ప్రయత్నం చెయ్యవచ్చు. ప్రతి ఒక్కరు ఏ విషయం గురించైనా పరిజ్ఞానాన్ని కొంత పెంచుకోవచ్చు.

యాంత్రిక బుర్రల వల్ల ప్రమాదాల గురించి బోలెడు హెచ్చరికలు ఒక వైపు వినిపిస్తున్నాయి. మరో వైపు మును పెన్నడూ లేనన్ని విద్యా ప్రయోజనాలు కనిపిస్తున్నాయి.  పురోగతిలోని ప్రతి కొత్త సాధనానికి మంచి చెడు అనే ఇరుప్రక్కలున్నట్లే తెలివైన యంత్రాలూనూ.

***

తెలుగులో వైజ్ఞానిక సాహిత్యం ఎందుకు అని అడిగి తెలుగు యొక్క అర్హతను ప్రశ్నించడం కన్నా, తెలుగుకు అర్హత లేదన్న పరిమితిని మనమే గిరి గీసుకొని నిర్బంధించుకొనడం కన్నా, రచయితలు అందరూ విజ్ఞాన రచనలకు తమ కలాలను కాలాన్ని కొంత కేటాయిస్తే, విజ్ఞాన సాహిత్యం కొంత వెలయిస్తే, రాబోయే తరాలకు తెలుగులో వైజ్ఞానిక సాహిత్యాన్ని చూసుకుని గర్వపడే అవకాశాన్ని కలిగించిన వాళ్ళం అవుతాం. తెలుగు యొక్క వైజ్ఞానిక పార్శ్వాన్ని సైతం పెంచిన వాళ్ళం అవుతాం.

# మనవి

తెలుగు విజ్ఞానసరస్వతికి మీ వంతు పత్ర పుష్ప సమర్పణగా భావించి రచనలు పంపించమని మా సవినయ మనవి.

**అభిప్రాయాలు:** తెలుగులో వైజ్ఞానిక సాహిత్యం పట్ల మీ అభిప్రాయాలను రెండు వందల పదాలకు మించకుండా వ్యాసం రాసి మాకు ఏప్రిల్ 1 లోగా పంపండి. భాష గురించి, పరిభాష గురించి, శాస్త్రాల గురించి, శాస్త్ర విభాగాల గురించి, దేని గురించైనా మీ అభిప్రాయాలను మాకు తెలియజేయండి.

**వ్యాసాలు:** ఇక పత్రికలోని ప్రధాన వ్యాసరచనలకు నిడివి నిబంధన ఏమీ లేదు. అయితే వ్యాసం గ్రంథమంత అయిపోకూడదు. వ్యాస విషయం సైన్సు, ఇంజినీరింగు, వైద్యానికి సంబంధించినదై ఉండాలి. జీవ, గణిత, భౌతిక, రసాయనిక, భూ, భూగర్భ, భౌగోళిక, ఖగోళ, వాతావరణ ఇత్యాది వివిధ ప్రాథమిక శాస్త్రాలు, గని, లోహ, నిర్మాణ, యంత్ర, రసాయన, విద్యుత్, ఎలెక్ట్రానిక, కలన, మాపక, వ్యవసాయ ఇత్యాది సాంకేతికతా తంత్ర శాస్త్రములు (engineering), కణ, జన్యు, సంతాన, రక్త, గుండె, ఉదర, ఊపిరి, మేధ, కండ, కార్జ, ప్లీహ, మూత్రాంగ, చర్మ, రోగ, ఔషధ, ఆరోగ్య ఇత్యాది వైద్య సంబంధిత విభాగములు — అన్నీ విజ్ఞాన భారతి వ్యాసములకు ఆసక్తికరమైన అంశములే.

వ్యాసాలు పంపవలసిన గడువు తేదీ **ఏప్రిల్ 1, 2026**
విజ్ఞాన భారతి నాల్గవ సంచిక విడుదల తేదీ **మే 1, 2026**

మా చిరునామా: teluguvbharati@gmail.com
(మధ్యలో v ఉంది సుమా! )